# ఎలా వుంది కథ?

జీలుగుల్ల జానకీదేవి



"ఏం చేస్తున్నావు, మధూ?"

హడావిడిగా లోపలి కొచ్చిన రాఘవ్-అక్కడి భీతావహ దృశ్యం చూసి స్తంభీభూతుడయ్యాడు.

మధుర మంచంలో గిలగిల తన్నుకుంటు న్నది. నోటివెంట నురుగులొస్తున్నాయి. అంత దూరం నించే వాసన గప్పుమన్నది. ఖాళీగా ఉన్న ఎండ్రిన్ డబ్బా తనను చూసి నవ్వుతున్నట్లని పించింది రాఘవ్‌కు.

దూరంగా గాలికి రెపరెపలాడుతున్న ఉత్తరం రాఘవ్ కంట బడింది. ఆత్రంగా తీసి చదివాడు.

శ్రీవారి పాద పద్మములకు—

ఈ మధ్య మీకు, మాధవికి నేనొక అడ్డుగోడ నయ్యాను. చిన్నప్పటి నుంచి మాధవి, మీరు ప్రేమించుకొన్న సంగతి నాకు తెలియదు. అదీ ఈ మధ్యనే తెలిసినది—మీ డైరీ చూసిన తర్వాత, మాధవి మీకు వ్రాసిన ఉత్తరాలు చదివిన

తర్వాత—పూర్తిగా మీ ప్రేమాయణం బయట బడింది. అంతగా మాధవిని ప్రేమించిన వారు మరి నన్నెందుకు పెళ్ళి చేసుకున్నారో అర్థం కావడం లేదు. బహుశా మానాన్న ఇచ్చిన పది వేల కట్నానికి మీరు మంత్రముగ్ధులై ఉంటారు. అవునా?

ప్రతిరోజూ రాత్రిపూట ఇంటికెందుకంత ఆలస్యంగా వస్తున్నారో ఇప్పుడర్థమవుతున్నది. ఆడదానికి శత్రువు ఆడదేనన్న నగ్న సత్యాన్ని ఇప్పటికి స్వానుభవంతో తెలుసుకున్నాను.

ఇంతకన్నా నాకు నిదర్శనా లక్కర్లేదు! పండంటి నా సంసారంలో చిచ్చు పెట్టిన మాధవిని నేను ఏమీ అనను; అనలేను! ఎవరి ఖర్మ వాళ్ళది; ఎవరి అదృష్టం వాళ్ళది. మాధవిని నిందిస్తే మట్టుకు నాకొచ్చే ప్రయోజన మేమిటి? మన బంగారం మంచిదయితే కంసాలి కత్తి పెడతాడా? నా దైవమే నన్ను తిరస్కరించి నప్పుడు ఇతరులను ఆడిపోసుకోవడం అవివేకమే అవుతుంది. నేను వ్రాసినదంతా అబద్ధ మనుకున్నట్లయితే – ఒకప్పుడు మాధవి మీకు వ్రాసిన ఈ ఉత్తరం చదవండి.

"డియర్ రాఘవ్!

నన్ను అప్పుడే మరచి పోయావా? ఇంటికి శ్రీమతి వచ్చిన తర్వాత ఇక నా అవసరం లేదనుకున్నావా? నీ కోసం చకోరంలా ఎన్నాళ్ళని ఎదురు చూడను? నేరుగా మీ ఇంటికే వద్దామనుకుంటే మీ ఆవిడకేం అనుమానం కలుగుతుందోనని రావడం మానేశాను. మన స్నేహం మూడుపూలు ఆరు కాయల్లా ఉండా లనుకోలేదూ? అవన్నీ ఇప్పుడు నీకు జ్ఞాపకం ఉండవులే! ఏమైనా చక్కటి భార్యను సంపాదించావు. అబ్బ! నిజంగా నీతో కలసి సినిమా చూసి ఎన్నాళ్ళయింది, రాఘవ్? నిన్ను మన సారా ప్రేమిస్తున్నానంటే నమ్మవు. నా హృదయ కవాటాలు ఎప్పుడూ నీ కోసం తెరిచే ఉంటాయి! నీవు ఎక్కడ కలుసుకోమంటే అక్కడికే వస్తాను.

—మాధవి"

దొంగలా ఎలా దొరికి పోయానని ఆలోచిస్తున్నారా? అటువంటి ఆలోచనలేం మీకక్కర్లేదు! నేను బ్రతికి ఉండగా మాధవిని మీరు పొందలేరు. అందుకే ఈ జీవితంనుంచి శాశ్వతంగా నిష్క్రమిస్తున్నాను.

నన్ను సుఖపెట్టక పోయినా కనీసం ఆ మాధవి నయినా సుఖపెట్టండి. మీకీ ఉత్తరం చేరేసరికి నేనీ లోకాన్నే విడిచిపెడతాను........

మీ

—మధుర

ఉత్తరం చదవడం ముగించి—"ఎంత పని చేశావు, మధూ? బ్రతికి సాధించలేని దాన్ని చచ్చి సాధిద్దామనుకున్నావా? అక్కడే నువ్వు పొరపడ్డావు! నువ్వు అనుమానించినట్లుగా 'మాధవి' ఆడదికాదు! వాడు నా ఫ్రెండ్—మాధవ్! 'మాధవి' అనే కలం పేరుతో కథలూ అవీ వ్రాస్తుంటాడు. చిన్నప్పటినుంచి వాడు 'మాధవి' పేరుతో నాకు ఉత్తరాలు అవీ వ్రాస్తుండేవాడు. నిజానిజాలు తెలుసుకోకుండా చాలా తొందరపడ్డావు, మధూ!" అంటూ రాఘవ్ తలబాదుకుంటుంటే—

"ఇది కలా? నిజమా?" అనుకుంటూ తక్కున మంచంలో లేచికూర్చుంది మధుర.

అంతవరకూ నిర్జీవంగా, అచేతనంగా మంచంలో గిలగిల తన్నుకుంటున్న మధుర—దిగ్గున మంచంమీద లేచి కూర్చునేసరికి నిర్ఘాంత పోయాడు రాఘవ్.

"ఇదంతా నాటక మన్నమాట! నిజాన్ని తెలుసుకోవడానికి పన్నిన పన్నుగడ అన్నమాట! ఇదంతా నిజమేననుకొని మోసపోయాను. మొత్తానికి నీ ఆడబుద్ధి పోనిచ్చావు కాదూ?" చిరునవ్వుతో మధురను మరింత దగ్గరకు లాక్కుంటూ అన్నాడు రాఘవ్.

"లేకపోతే ఏమిటండీ! ఆడ పేర్లు పెట్టుకొని మగవాళ్ళు ఇలా ఉత్తరాలు వ్రాస్తూ మగువలను ఏడిపించడం—ఇదో మగాళ్ళ బుద్ధి అనుకున్నారా?" భర్త కళ్ళలోకి కొంటెగా చూస్తూ అన్నది మధుర.

*

అంతవరకు కథచెప్పి—"ఎలా ఉందికథ?" అన్నాడు కృష్ణమూర్తి.

"మీకేం! రచయితలుగా? ఎలా చెప్పినా బాగానే ఉంటుంది. మధుర ఎండ్రిన్ తాగినట్లు నటించకపోయినట్లయితే నిజం తెలిసేది కాదు! పైగా అనుమానం ఇంకా జాస్తి అయ్యేది! నిజంగానే మధుర ఎండ్రిన్ తాగిందనుకొని కుప్పలా కూలిపోయాడు రాఘవ్. మొత్తానికి కథ బాగా రక్తి గట్టింది. రచయితగారి కథా విధానం ఎక్సలెంట్‌గా ఉంది!" అన్నది నాగలక్ష్మి భర్తకేసి చూస్తూ. *

గేయం:

## కవిత

లోకాన శోకాల
చీకట్లు తరిమేసి
నవజీవన ప్రభలు
నర్తింపజేయుటకు
కలం కదిలించాలి!
కవిత సృష్టించాలి

వేదనాభరితమై
రోదనాకలితమై
క్షోభించు బ్రతుకులను
శోభిల్లజేయుటకు
కలం కదిలించాలి!
కవిత సృష్టించాలి!!

సరిహద్దులను చెరిపి
సహజీవనము నేర్పి
విశ్వ మానవప్రేమ
వెలుగు వెదజల్లుటకు
కలం కదిలించాలి!
కవిత సృష్టించాలి!!

—యస్వీ స్వరాజ్యం